వైఎస్ జగన్ వెంటే మేమంతా



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు సావిత్రమ్మ. అగళి మండలం నరసంబూది గ్రామం. వైఎస్ జగన్ పాలనలో ఈ కుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.40,500, వైఎస్సార్‌సున్నా వడ్డీ కింద (రైతులు) రూ.1,750, వైఎస్సార్‌సున్నా వడ్డీ కింద (డ్వాక్రా) రూ.4,920, వైఎస్సార్ పంటల బీమా కింద రూ.11,660, వైఎస్సార్ ఆసరా కింద రూ.20,936, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82 వేలతో కలిపి మొత్తం రూ.1,61,722 లబ్ధి చేకూరింది. మా కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా ఉంటామని సావిత్రమ్మ తెలిపింది. మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని చెబుతోంది.

- మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం



సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



ఓ వ్యక్తికి వైద్య చికిత్స చేయిస్తానని చెబుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

మడకశిర(అగళి): రాష్ట్రంలో ప్రజలంతా వైఎస్ జగన్ వెంటే ఉన్నారు. మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని తెలిపారు. సంక్షేమ పథకాలను పక్షపాతం లేకుండా అందిస్తున్న ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గురువారం అగళి మండలం నరసంబూదిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు అలాగే కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్రానికి జగన్ నాయకత్వం ఎంతో అవసరమన్నారు. పేదల పెన్నిధిగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. పేదల కోసం ప్రత్యేకంగా నవరత్నాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాల ద్వారా పేద విద్యార్థులకు అండగా నిలబడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం రుణాలు మాఫీ చేస్తున్నారని వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలు, పేదలు ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. చంద్రబాబు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. అర్హత ఉన్న వారికి నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, ఎంపీడీఓ శ్రీనివాస రావు, మండల కన్వీనర్ మహేంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, జేసీఎస్ కన్వీనర్ శివన్న పాల్గొన్నారు.

అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శం..

హిందూపురం: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించే ప్రజా ప్రభుత్వాన్ని అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఆయా కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైల్వే రోడ్డు అయ్యప్ప ఆలయం ఏరియా, రహమత్‌పురం సర్కిల్ కాలనీల్లో పర్యటించారు. ఇంటి పట్టాలు, పింఛన్లు మంజూరు చేయాలని పలువురు కోరారు. మరికొందరు డ్రైనేజీలు నిర్మించాలని విన్నవించారు.

టీడీపీ పాలనలో కనీసం పలకరించారా?

టీడీపీ పాలనలో ప్రజల ఇంటికి వచ్చి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారా? కనీసం మీరు ఎలా ఉన్నారని పలకరించిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా అని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పని చేస్తుందన్నారు. అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో 98 శాతం హామీలు నేరవేర్చామన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా కులమత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. టీడీపీ నాయకుల కుటుంబాలకు సైతం రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయకపోగా.. ఒక్క వార్డులో కూడా సరైన రోడ్లు, డ్రైనేజీ సక్రమంగా లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ పాలకులు జేబులు నింపుకోవడానికి కృషి చేశారే తప్పా.. ఎక్కడ అభివృద్ధి చేసింది లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లు కరోనా కష్టం వచ్చింది. ఏడాదిలోనే అవసరమైన అన్ని చోట్ల రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 16వ వార్డులో రూ.20 లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ప్రతి వార్డు, గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్తున్నాం.. కష్టాలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. ఎన్నికల సమయంలో వచ్చి డైలాగులు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపించి తిరిగి కనిపించకుండా పోయే రకం కాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు ముస్తక్, మల్లికార్జున, నాగేంద్రమ్మ, రహమత్‌బీ, కో-ఆప్షన్ సభ్యులు రహమత్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేందర్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మాత్రమే అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 16న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సింగిల్‌విండో అధ్యక్షుడు మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సేవాభావం అలవర్చుకోండి



ప్రాక్టీస్ విత్ సైకిక్ పవర్ పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డీసీ పాణి రచించిన 'ప్రాక్టీస్ విత్ సైకిక్ పవర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో అనారోగ్య సమస్యలు, మానసిక రుగ్మతలు, ఆర్థిక సమస్యలు ఎలా పరిష్కారమవుతాయో వివరించడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్‌లో చేరి సేవ చేయాలన్నారు. అనంతరం రచయిత పాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, కళాశాల కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

చింత ఫలసాయం వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి సచివాలయంలో గురువారం పంచాయతీలోని చింత చెట్లను సర్పంచ్ నర్సేగౌడు, ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి సమక్షంలో వేలం వేశారు. చిన్నప్ప అనే వ్యక్తి రూ.13 వేలకు చింతచెట్లను దక్కించుకున్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకారం అందించాలని అధికారులు కోరారు.

ఉత్తమ సేవలందించండి

రొళ్ల: సచివాలయాల ద్వారా అందిస్తున్న ఈ-సర్వీసెస్ సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ కిష్టప్ప పేర్కొన్నారు. గురువారం రొళ్ల-1, 2 సచివాలయాలను సందర్శించారు. ఆయా సచివాలయాల్లో ప్రజలకు ఎన్ని రకాల సేవలు అందిస్తున్నారని ఆరా తీశారు. ప్రజలకు అన్ని రకాల సేవలు అందించడం కోసం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఉండి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి వలంటీర్ల ద్వారా సేవలు అందించడానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పథకాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు.

గుండెపోటుతో వైద్యుడి మృతి

పెనుకొండ రూరల్: గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వర్తిస్తున్న గిరిధర్ (46) గుండెపోటుతో గురువారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు.. గోరంట్లలోని తన నివాసంలో ఉన్న గిరిధర్‌కు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

సోమందేపల్లి: 18 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో చేర్చుకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ రోడ్డు, వాల్మీకి సర్కిల్ ప్రాంతాల్లో బాల కార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దుకాణాల్లో, పరిశ్రమల్లో బాల కార్మికులను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు అన్నదాన సత్రం ప్రారంభోత్సవం

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దాతలు అందజేసిన సుమారు రూ.60 లక్షలతో అన్నదాన సత్రాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



హిందూపురంటౌన్: విద్యార్థిని మధుకు షూ అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు



పరిగి: నిఖిల్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని హెచ్.మధు అండర్-17 స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై ంది. ఈ మేరకు గురువారం స్థానిక పాఠశాలలో ప్రిన్సిపాల్ సామ్రాజ్యం విద్యార్థినిని అభినందించి, ప్రోత్సాహంగా షూ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఇటీవల కడప జిల్లా ఎర్రగుంట్లలో నిర్వహించిన అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు విద్యార్థిని మధు ప్రాతినిధ్యం వహించిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైందన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థినులు కె.అనూరాధ, కె.లిఖిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీడీ లోక్‌నాథ్, సురేష్‌బాబు, విలియమ్ శేఖర్, రాణి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నిఖిల్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు గురువారం తెలిపారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకూ బిహార్‌లోని పాట్నాలో జరిగే అథ్లెటిక్స్‌లో 600 మీటర్ల పరుగు పోటీల్లో నిఖిల్ పాల్గొంటాడన్నారు. కాగా బిహార్‌కు వెళ్లి రావడానికి విద్యార్థికి రూ.5,500 ఆర్థికసాయాన్ని పూర్వ విద్యార్థుల తరఫున అశ్వర్థనారాయణ అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ షబానా పాల్గొన్నారు.

25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, కాంగ్రెస్ నాయకులు

మడకశిర రూరల్: మండల పరిధిలోని ఏ.ఆర్.గౌరీపురం గ్రామానికి చెందిన 25 కుటుంబాలు టీడీపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి గురువారం రాత్రి ఆదిరెడ్డిపాళ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, ఇందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మండల సచివాలయ కన్వీనర్ నాగేంద్రయాదవ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, నాయకులు రంగనాథ్, శ్రీనివాసులు, అంజన్‌కుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

26న ఛత్రపతి శివాజీ జయంతి



ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద పూజలు చేసిన దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలో ఈనెల 26న ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కోర్ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక రాజధాని ఫంక్షన్ హాలులో ఛత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల 26న ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. జయంతి వేడుకలకు పరిపూర్ణానంద స్వామి వస్తారని పేర్కొన్నారు. ఆరు నెలల్లోపు శివాజీ విగ్రహాన్ని పూర్తి చేసి, ప్రతిష్టిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు చలపతి, ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మేడికుర్తి హరి, రామకృష్ణ, కోశాధికారి బంగారు చంద్ర, కార్యదర్శి జగదీష్, ప్రాణేష్, రామాంజినేయులు, గోరఖ్‌నాథ్, జగదీష్, శ్రీనివాస్ రెడ్డి, శంకరప్ప, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రాగి సాగుపై సూచనలిస్తున్న ఏఓ విజయభారతి

పరిగి: పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులను అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. మండలంలోని మోదా రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న ఈ-పంట నమోదును గురువారం పరిశీలించారు. అనంతరం గ్రామ పరిధిలో రైతులు సాగు చేసిన రాగి పంటలను పరిశీలించి సూచనలిచ్చారు. ప్రధానంగా నారుముడిని రాగి పొలంలో నాటి, వారం రోజుల పాటూ తడిగా ఉంచాలన్నారు. 30 రోజుల తరువాత కలుపు తీయించాలని ఫలితంగా నేల గుల్లబారి పైరుకు గాలి వెలుతురు ప్రసరించడంతో పాటూ పిలకలు ఎక్కువగా వచ్చేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కూలీలు దొరకని పరిస్థితుల్లో ఎకరానికి 400 గ్రాముల 2, 4డీ సోడియం సాల్ట్ పిచికారీ చేయాలని తెలిపారు. సకాలంలో పంట రక్షణ చర్యలు చేపడితే పంటను ఆశించే చీడపీడలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రుక్సానా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఏన్జీఓ నాయకులు

హిందూపురం టౌన్: మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ అన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో తాలుకా అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో తాలుకా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మహిళా ఉద్యోగుల సమస్యలు, అలాగే తాలూకాలో ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు. వాటి పరిష్కారం దిశగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్జీఓ సమాచారానికి సంబంధించిన బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, మహిళా వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, జిల్లా మహిళా వింగ్ చైర్‌పర్సన్ జమీలబీ, అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, రవీంద్రనాథ్, ప్రసాద్, తాలూకా కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ శివన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బైక్ అదుపు తప్పి, ఇద్దరికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని చిట్నడకు గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గుడిబండ మండలం రామయ్యన హట్టికి చెందిన ఈరన్న, చిత్తన్న కర్ణాటక రాష్ట్రం హిరియూర్ తాలుకా గొల్లహళ్లిలో వెలసిన గొల్లాలమ్మ జాతరకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చిట్నడకు సమీపంలో బైకు అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో ఈరన్న కాళ్లు విరిగాయి. చిత్తప్పకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందిస్తున్నారు.

వన్‌టౌన్ సీఐగా ఈరన్న

హిందూపురం: వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సీఐగా ఎం.ఈరన్నను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ ఇస్మాయిల్‌ను కొద్ది రోజుల కింద ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. కాగా టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు వన్‌టౌన్‌కు కూడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం ఈరన్న బాధ్యతలు స్వీకరించిన తర్వాత వెంకటేశ్వర్లు ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి రిలీవ్ అవుతారు.

సమయానికి బస్సులు నడపాలి



జమ్మానిపల్లిలో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్: పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. రోజూ 8 గంటలకు గ్రామంలోకి వచ్చే బస్సు.. గురువారం ఆ సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పరీక్షలు ఉండటంతో కొంత మంది ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లిపోయారు. 9:30 గంటల సమయంలో బస్సు గ్రామంలోకి వచ్చింది. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా బస్సు నడపాలన్నారు.

పచ్చని చెట్లకు నిప్పు



కొడికొండ చెక్‌పోస్ట్-లేపాక్షి ప్రధాన రహదారి పక్కన కాలిపోయిన చెట్లు

చిలమత్తూరు: గతేడాది కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన చెట్లు ఏపుగా పెరుగుతున్నాయి. అయితే కొందరు ఆకతాయిల కారణంగా చెట్లన్నీ అగ్నికి ఆహుతవుతున్నాయి. కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి లేపాక్షి వైపునకు వెళ్లే 544-ఈ ప్రధాన రహదారిపై గురువారం పదుల సంఖ్యలో మహాగని చెట్లు కాలిపోయి బూడిదైపోయాయి. చెట్లను సంరక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై ఆరా తీసిన పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. మండలంలో ఎర్రకొండ అటవీ ప్రాంతంలో వేల హెక్టార్లలో అటవీ సంపద విస్తరించి ఉంది. ఫారెస్ట్ అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి

హిందూపురం: సంకష్ట హరచతుర్థిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని వినాయక ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీనివాస మందిరం, బెంగళూరు రోడ్డు, కాయగూరల మార్కెట్, మేళాపురం పంచముఖ వినాయక ఆలయంలో విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

రొద్దం: మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో ఓ మహిళపై మహేశ్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంతో గ్రామస్తులు బుధవారం రాత్రి దేహశుద్ధి చేశారు. గురువారం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి చెప్పారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

పెన్షనర్లు ఈ-కేవైసీ చేయించుకోండి

మడకశిరరూరల్: రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తాలుకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు నజీర్, కార్యదర్శి సత్యనారాయణచారి, ట్రెజరర్ రాజశేఖర్ ఓ ప్రకటనలో సూచించారు. కంప్యూటర్ సెంటర్, సబ్ ట్రెజరీలో సీఎఫ్ఎంఎస్, ఆధార్ నంబర్ తీసుకెళ్లి, ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

దాత సహకారం వెలకట్టలేనిది

పెనుకొండ: దాత సహకారం వెలకట్టలేనిదని పట్టణంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్ ప్రిన్సిపాల్ గంగాధర్ అన్నారు. గురువారం వసతి గృహంలో ముంబాయి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ ఎంవీ రావు ఆర్థిక సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. తాగునీటి సమస్యను ఎంవీ రావుకు వివరించడంతో.. వెంటనే ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. ఆయన చేసిన సహాయాన్ని ఎన్నటికీ మరువమన్నారు. విద్యార్థులు అంకిత భావంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అహర్నిశలు శ్రమిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఎంఐఎం నాయకులు

హిందూపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ఎంఐఎం నాయకులు తెలిపారు. గురువారం ప్రశాంత్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు మార్కెట్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో 15వ వార్డుకు చెందిన ఎంఐఎం నాయకులు అర్బర్, ముక్కిడిపేట నస్రుద్దీన్ వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మన్సూర్, జబీ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

అమరాపురం: పాఠశాలలో వంట ఏజెన్సీల నిర్వాహకులు ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని విరుపసముద్రం, వలస, నడలూడం పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు రాస్తున్న నిర్మాణాత్మక మూల్యాంకనం-3 పరీక్షలను పర్యవేక్షించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? పరీక్షలకు ఎంతమంది హాజరయ్యారు? పరీక్షల తరువాత వెంటనే ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు ఏ విధంగా చేయాలో వివరించారు. రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఆటో బోల్తా: విద్యార్థులకు గాయాలు



మలుపు వద్ద బోల్తా పడిన ఆటో



త్రివేణిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గురువారం ఉదయం హేమావతి నుంచి త్రివేణి, సౌమ్య, చరిత, శివమ్మ, సిద్దార్థ ఆటోలో అమరాపురానికి ప్రయాణమయ్యారు. కొంత దూరం వెళ్లిన ఆటో.. సబ్‌స్టేషన్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో త్రివేణి కళ్లు, చేతులు, కాలికి తీవ్ర గాయాలు కాగా.. సౌమ్య చేతికి, కాలికి గాయాలయ్యాయి. అలాగే చరిత, శివమ్మ, సిద్దార్థకు మూగ దెబ్బలు తగిలాయి. వీరికి అమరాపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాలని డాక్టర్ సూచించారు.